
ప్రజాశక్తి
బుధవారం 12 జూన్ 2024
5
విజయనగరం



15న క్రీడా పాఠశాలకు ఎంపికలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈ నెల 15న విశాఖపట్నంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నడుస్తున్న స్పోర్ట్స్ హాస్టల్‌లో బాలురకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిబాబు, కెవిఎఎన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు అత్యుత్తమ క్రీడా వసతులతోపాటు నిష్ణాతులైన శిక్షకులతో వాలీబాల్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రీడా శిక్షణతోపాటు ఎంపికైన క్రీడాకారులు చదువును కూడా కొనసాగించవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న బాలురు 18 ఏళ్లలోపు వయస్సు ఉండాలని, 190 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలని తెలిపారు. 15న ఉదయం ఎనిమిది గంటలకు విశాఖపట్నం పోర్టు స్టేడియంలో వయస్సు నిర్ధారణ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, క్రీడలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉంటే తీసుకుని హాజరుకావాలని కోరారు.

జిల్లాకు విద్యార్థి కిట్లు

- పంపిణీకి సిద్ధం చేస్తున్న విద్యా శాఖ సిబ్బంది
- నేటికీ రాని యూనిఫాం



ఆయా మండలాలకు పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాలు

ఈ నెల 13 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన అన్నింటినీ అందజేసేందుకు జిల్లా విద్యాశాఖ సమాయత్తమవుతోంది. ఇప్పటికే సగానికి పైగా పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుకోగా, వాటిని పాఠశాలలకు చేరవేశారు. యూనిఫాం మినహా మిగతా సామగ్రి కూడా జిల్లాకు చేరుకుంటోంది. వాటిని కూడా విద్యార్థులకు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని 1642 పాఠశాలకు సంబంధించి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసేందుకు విద్యాశాఖ ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ చేసింది. ఆ స్కూళ్ల నుంచి 9.15 లక్షల పాఠ్య పుస్తకాలు ప్రతిపాదన పెట్టగా, 63 శాతం ఇప్పటికే జిల్లాకు వచ్చాయి. వాటిని ఆయా మండలాలకు, అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేశారు. జగనన్న విద్యా కానుక (జెవికె) పేరున స్కూళ్లలో పాఠ్య పుస్తకాలు, బ్యాగులు గత ఐదేళ్లలో పంపిణీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో విద్యా కానుక కిట్లకు బదులుగా 'స్టూడెంట్ కిట్'గా పేరు మార్చి స్కూల్ బ్యాగులపై గతంలో ఉండే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫొటో కూడా తీసివేశారు. ఈ కిట్లలో ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉంచి స్కూళ్ల వారీగా కేటాయించి పంపిణీ చేశారు. అన్ని స్కూళ్లన్నింటికీ బెల్టులు, షూల కిట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలాల్లో స్టూడెంట్ కిట్లు సమగ్ర శిక్ష సిబ్బందితో మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో ఇప్పటికే చేరవేసే కార్యక్రమాన్ని విద్యాశాఖ చేపట్టింది.

పాఠశాలల్లో విద్యార్థులు ఇలా..

జిల్లాలోని 27 మండలాల్లో 1642 ప్రభుత్వ పాఠశాలల్లో 1,41,479 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో బాలురు 66,604 మంది, బాలికలు 73,875 మంది. అన్ని చోట్లా విద్యార్థులకు పూర్తిస్థాయిలో సక్రమంగా కిట్లు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాకు చేరుకోని యూనిఫాం

విద్యార్థి కిట్లలో ఉండాల్సిన సామగ్రిలో నోట్ పుస్తకాలు 98.5 శాతం, బ్యాగులు 71.5 శాతం, బెల్టులు 99.5 శాతం, షూలు 26 శాతం రాగా, యూనిఫాం పూర్తిగా నేటి వరకు చేరుకోలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో విద్యార్థి కిట్లు నూతన ఎమ్మెల్యేలతో పండగ వాతావరణంలో పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం చూస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కిట్లు అన్ని సిద్ధం చేసి విద్యాసంస్థలు ప్రారంభమైన తర్వాత పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలకు ఆయా మండలాలకు ఎన్ని కిట్లు, విద్యార్థుల సంఖ్య.. వంటి వివరాలు విద్యా శాఖాధికారులు పంపించే పనిలో నిమగ్నమై ఉన్నారు.



పంపిణీ సిద్ధం చేస్తున్న బెల్టులు

ఎపిఇఎపిసెట్‌లో
మెరిసిన జిల్లా విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, బొబ్బిలి


ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎపి ఇఎపిసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో ఇంజినీరింగ్‌లో మెరుగైన ర్యాంకులతో మెరిశారు. డి.శ్రీనిధి 55వ ర్యాంక్, బి.సందీప్ శంకర్ 312, ఆర్‌జి ఎస్ఆర్ శ్రీవత్స 995, ఎస్.రోషిణి 1640, ఎన్.నాగ ఈశ్వర్ అక్షయ్ 2069, టి.అభినయ కార్తీక్ వర్మ 2786, ఎన్.సాయిగణేష్, 2844, తొత్తడి ప్రవీణ్ 1361 ర్యాంకులు సాధించారు.

శరణ్యకు 126వ ర్యాంకు

బొబ్బిలి పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన డోకుల శరణ్య.. ఫార్మసీలో 126వ ర్యాంకు సాధించింది. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో కూడా శరణ్య జాతీయ స్థాయిలో 2041వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 704వ ర్యాంకు సాదించింది. శరణ్య తండ్రి వెంకటరమణ ప్రభుత్వ ఉపాధ్యాయులు, తల్లి అరుణ గృహిణి. శరణ్య మంచి ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పక్కి గ్రామానికి చెందిన శంబంగి శరణ్య ఫార్మసీలో 138వ ర్యాంకు సొంతం చేసుకుంది. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో శరణ్య జాతీయ స్థాయిలో 2928వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 1039వ ర్యాంకు సాధించింది. శరణ్య తండ్రి శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయులు, తల్లి పార్వతి గృహిణి. కుమార్తె మంచి ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంజినీరింగ్



డి.శ్రీనిధి
55వ ర్యాంకు



బి.సందీప్ శంకర్
312వ ర్యాంకు


ఫార్మసీ



డి.శరణ్య
126వ ర్యాంకు



ఎస్.శరణ్య
138వ ర్యాంకు



ఒకే వేదికపై మెరిసిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

విజయవాడలో మంగళవారం జరిగిన ఎన్‌డిఎ శాసనసభా పక్ష సమావేశంలో ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు సందడి చేశారు. ఒకే వేదికపైకి చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన, గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, సాలూరు ఎమ్మెల్యే గుమ్మిడి సంధ్యారాణి, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి.. ఇలా అంతా చేరి అందరి దృష్టినీ ఆకర్షించారు.

- ప్రజాశక్తి, విజయనగరం కోట

జిఒ 117ను రద్దు చేయాలి

ఎమ్మెల్సీ రఘువర్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయుల సమస్య వెంటనే పరిష్కరించాలని, మూడు, నాలుగు, ఐదు తరగతుల విలీనం ఆపి, జిఒ 117 రద్దు చేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన ఎపిటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1998, 2008 ఎంటిఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని కోరారు. కెజిబివిలకు ఎటువంటి షరతులు లేకుండా ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షులు షేక్ బుకారిబాబు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని కోరారు. అమ్మఒడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే ఇవ్వాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాస్ మాట్లాడుతూ మెగా డిఎస్‌సి ప్రకటించాలని, ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లు ఉపాధ్యాయులకు ఇవ్వాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న నాడు- నేడు పనులు ప్రభుత్వం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బంకురు జోగినాయుడు, సిహెచ్.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసన్, జక్కు శివాజీ , కర్రి రవి, ఎం.వి.రమణ, వై.సీతం నాయుడు, లంక రామకృష్ణ, జివివి ప్రసాద్ కర్రాసింహాచలం పాల్గొన్నారు

ప్రమాణ స్వీకారానికి తెలుగు తమ్ముళ్లు

- నియోజకవర్గానికి నాలుగు బస్సులు
- కీలక నేతలంతా కార్లలోనే ప్రయాణం
- కూటమి నేతల్లో జోష్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సిఎం ప్రమాణ స్వీకారానికి తెలుగు తమ్ముళ్లు విజయవాడలోని కేసరపల్లికి తరలివెళ్లారు. కొందరు బస్సుల్లోనూ, మరికొందరు రైళ్ల, ఇంకొందరు కార్లలోనూ మంగళవారం ఉదయం నుంచి ప్రయాణం మొదలుపెట్టారు. దీనికి సంబంధించి టిడిపి, జనసేన పార్టీలకు చెందిన విఐపిలు, వివిఐపిలకు గడిచిన రెండురోజులుగా ప్రత్యేక ఆహ్వానాలు అందాయి. కారు ఎంట్రీ పాసులను కూడా జారీచేశారు. ముఖ్యంగా ప్రభుత్వం తరపున ప్రతి నియోజక వర్గానికి నాలుగు బస్సులు చొప్పున విజయనగరం జిల్లాలో 28 బస్సులు, పార్వతీపురం మన్యం జిల్లాలో 16 ఏర్పాటు చేశారు. ఈ లెక్కన మండలానికి ఒకటి చొప్పున బస్సులను కేటాయించారు. ప్రతి గ్రామం నుంచీ కనీసం ఒక ప్రతినిధిని బస్సుల్లో పంపే విధంగా ఏర్పాట్లు చేశారు. ఇవి కాకుండా స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్యేక వాహనాలను పార్టీ తరపున, వ్యక్తిగతంగాను బుక్ చేశారు. ఈ బస్సులన్నీ మంగళవారం మధ్యాహ్నం నుంచి బయల్దేరాయి. ఈ మేరకు ప్రభుత్వం తరపున జిల్లా అధికారులే బస్సులను సమకూర్చారు. ఇందులో ప్రయాణించేవారి దారి ఖర్చులు, భోజనాలు, తదితరాలన్నీ ఎమ్మెల్యేలు, నాయకులు చూసుకుంటున్నట్టుగా సమాచారం. ఈనేపథ్యంలో టిడిపి నాయకులు, క్రియాశీలక కార్యకర్తల్లో కొత్త జోష్ కనిపిస్తోంది. ప్రమాణ స్వీకారానికి వెళ్లే నాయకులు, కార్యకర్తలకు ప్రభుత్వం తరపున పాసులు కూడా అందజేశారు. ఈ లెక్కకు మించి తెలుగు తమ్ముళ్లు బయలుదేరారు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి టిడిపి జిల్లా కార్యాలయం (అశోక్ బంగ్లా) సందడిగా కనిపించింది. ఇక్కడి నుంచి బయలుదేరిన కార్లు ప్రత్యేక కాన్వాయ్‌ని తలపించాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్లా జనసైనికుల ప్రయాణం కూడా ఎక్కువగానే కనిపించింది. ఇలా వెళ్లిన నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గాల వారీగా కూర్చొనేందుకు వీలుగా అక్కడి ప్రమాణ స్వీకార సభలో ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. అక్కడ ప్రతి గ్యాలరీకి ఒకటి లేదా రెండు చొప్పున ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేయనున్నట్టుగా సమాచారం. జిల్లా ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని వీక్షించే విధంగా జిల్లా కేంద్రాలు, మండలంలోని ముఖ్యమైన కూడళ్లలో ఎల్ఎడి స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. విజయనగరంలోని కలెక్టరేట్, ఆనందగజపతి ఆడిటోరియంలో ప్రత్యక్ష ప్రసారాలు నిర్వహించనున్నారు.

ఎవరికి వారే తమ ఎమ్మెల్యేకు రాష్ట్ర మంత్రి పదవి వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు రెండు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలంతా రెండు రోజుల క్రితమే విజయవాడ చేరుకుని పార్టీ అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, లోకేష్‌లను కలిసిన సంగతి తెలిసిందే. మంగళవారం జరిగిన టిడిపి, ఎన్‌డిఎ శాసనసభా పక్ష సమావేశాల్లో పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ప్రభుత్వ భవనాలు, చారిత్రక కట్టడాలు, ఆలయాలు, ముఖ్యమైన కూడళ్లను ప్రత్యేక విద్యుత్తు అలంకరణ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో విజయనగరంలోని పైడితల్లమ్మ ఆలయం, కోట, గంటస్తంభం, మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల, సంస్కృత కళాశాల, కలెక్టరేట్, మర్రి చెన్నారెడ్డి భవన్, మున్సిపల్, ఆర్అండ్‌బి, జిల్లా పరిషత్తు, దేవాదాయ శాఖ కార్యాలయ సముదాయాలు సోమవారం రాత్రి నుంచి విద్యుత్తు అలంకరణ చేశారు.



విజయవాడ బయల్దేరి వెళ్తున్న టిడిపి నాయకులు



విద్యుత్తు కాంతులతో పైడితల్లమ్మ ఆలయం

ఆత్మబంధువు రామోజీరావు

వాజీ చానల్ ఎమ్‌డి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు తెలుగువారి ఆత్మబంధువని వాజీ చానల్ ఎమ్‌డి గణపతినీడి శ్రీనివాసరావు అన్నారు. వాజీ చానల్ ఆధ్వర్యంలో మంగళవారం రామోజీరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి ఆస్మా ఫర్హీన్ మాట్లాడుతూ రామోజీరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని అభివర్ణించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ నిరంతర శ్రమ, నిత్యం కొత్తదనం కోసం తపన, చెక్కుచెదరని ఆత్మ స్థైర్యం రామోజీరావు సొంతమన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జెసి నాయుడు, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ జి.హిమబిందు మాట్లాడుతూ పత్రికా రంగంపై చెరగని సంతకం రామోజీ అన్నారు. ముందుగా రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



మాట్లాడుతున్న వాజీ చానల్ ఎమ్‌డి శ్రీనివాసరావు

బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేసలి అప్పారావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆంధ్రప్రదేశ్‌ను బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. బుధవారం అంతర్జాతీయ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడకు చెందిన క్రాఫ్ సంస్థ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను నగరంలోని తోటపాలెంలో తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు అందరూ పాఠశాలల్లో విద్యను అభ్యసించాలన్నారు. బాలలను ఏ ఒక్కరినైనా పనిలో గానీ, ప్రమాద భరిత రంగాల్లో పెట్టుకుంటే వారిపై కేసులు నమోదు చేసి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బాలల కోసం పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రతినిధులు రాష్ట్రంలో బాలకార్మికులు లేకుండా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టి, వాటిపై అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది, కార్మిక శాఖ, పోలీసు శాఖ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రైల్వే శాఖ, మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ శాఖ, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా, ఇతర శాఖల భాగస్వామ్యంలో 2025 చివరి నాటికి రాష్ట్రాన్ని పూర్తి స్థాయిలో బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ ఇన్‌ఛార్జి అధికారి యాళ్ల నాగరాజు, సిబ్బంది బి.రామకోటి, వి.సంధ్య, చైల్డ్‌లైన్ సిబ్బంది సిహెచ్ అరుణ్ కుమార్, వి.మీనా, వైసిబి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జి.ఝాన్సీరాణి, ఫాల్గుణ పాల్గొన్నారు.



జ్యూట్‌మిల్లు స్థలంలో కర్రలు పాతిన కార్మికులు

జ్యూట్‌మిల్లు స్థలాన్ని ఆక్రమించిన కార్మికులు

పిఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి-బొబ్బిలి

శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు స్థలాన్ని కార్మికులు ఆక్రమించారు. జ్యూట్ మిల్లులో పని చేసిన 1300 కార్మికులకు పిఎఫ్ బకాయి సొమ్ము చెల్లించకపోవడంతో కార్మికులకు పింఛను రావడం లేదు. కొంతమంది కార్మికులకు పిఎఫ్ సొమ్ము అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిఎఫ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ మంగళవారం జ్యూట్ మిల్లు స్థలంలో షెడ్లు వేసేందుకు కర్రలు పాతారు. ఈ సందర్భంగా ఆదర్శ కార్మిక సంఘం అధ్యక్షులు వి.శేషగిరి, సభ్యులు చోడిగంజి రమేష్ నాయుడు, పి.కృష్ణ, జి.రామారావు, భుజంగ మాట్లాడారు. కార్మికులకు పిఎఫ్ బకాయిలు చెల్లించకపోవడంతో 1300మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 50 ఏళ్లు దాటిన కార్మికులకు పింఛను అందడం లేదన్నారు. పిఎఫ్ బకాయిలు చెల్లించాలని యాజమాన్యాన్ని, ప్రజాప్రతినిధులను, అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. పిఎఫ్ బకాయిలు చెల్లించే వరకు స్థలాన్ని తమ ఆధీనంలో ఉంచుతామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

కాలనీలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల



తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

నగర పంచాయతీ పరిధి గాంధీ నగర్ కాలనీలో ప్రభుత్వ స్థలం అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరారు. మంగళవారం కాలనీ వాసులు తహశీల్దార్‌కు అక్రమాలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ నగర్ కాలనీ రామాలయాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వైసిపి నాయకులు అండతో ఇదే కాలనీకి చెందిన ఎస్. కోటేశ్వరి అనే మహిళ తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకున్నట్లు తెలిపారు. గత 9నెలలుగా ప్రభుత్వ స్థలం ఆక్రమణపై అధికారులందరికీ ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు చేశామని తమ పై పోలీస్ కేసులు పెట్టారని వాపోయారు. కాగా అక్రమార్కులు తప్పుడు పత్రాల వివరాలు కూడా రెవెన్యూ రికార్డుల్లో కూడా లేనప్పటికీ అధికార్లు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలం ఆక్రమణ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విగ్రహాలకు ముసుగులు తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వేపాడ

సార్వత్రిక ఎన్నికల విధులు పూర్తికావడంతో కోడ్ సమయం ముగిసింది. దీంతో మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను అధికారులు మంగళవారం తొలగించారు. ఎన్నికల పూర్తయినా ముసుగులు తొలగించారా? అని ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన ఇఒపిఆర్‌డి ఉమా చర్యలు చేపట్టారు. గ్రామాల్లో ఉన్న విగ్రహాలకు వేసిన ముసుగులను ఉదయం నాటికే తొలగించారు.

రామోజీరావుకు జర్నలిస్టుల శ్రద్ధాంజలి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకి ఎస్‌కోట జర్నలిస్టులు మంగళవారం శ్రద్ధాంజలి ఘటించారు. పట్టణంలోని మహాత్మా గాంధీ పార్క్ ఆవరణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు గోవింద్ ప్రకాష్ శర్మ, హనుమాన్ శెట్టి నానాజీ మాట్లాడుతూ రామోజీరావు మరణం తెలుగు పత్రికా ప్రపంచానికి తీరని లోటని అన్నారు. 1936లో జన్మించిన ఆయన యాడ్ ఏజెన్సీలో ఉద్యోగిగా పనిచేశారని ఆ తరువాత ఈనాడు పత్రికను నెలకొల్పి పత్రికను నడపడంలో అనేక నిర్ణయాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ముగ్గు ధర్మారావు, జాగరం నాయుడు, గనివాడ బాపునాయుడు, రాజు, సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - రామభద్రపురం

మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రామభద్రపురం నూతన ఎంఆర్‌పిఎస్ కమిటీ నాయకులు హామీ ఇచ్చారు. ఆరికతోట బాప్టిస్ట్ చర్చి ఆవరణలో నూతన మండల కమిటీ ఏకగ్రీవంగా జిల్లా ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు బోగి శ్రీను మాదిగ, జిల్లా టీం అధ్యక్షతన ఎంపిక జరిగింది. మండల అధ్యక్షుడిగా యజ్జల రవికుమార్ మాదిగ, ఉపాధ్యక్షులుగా సవరాల అశోక్ మాదిగ, కార్యదర్శిగా యజ్జల ప్రసన్న మాదిగ, అనుబంధ కార్యదర్శిగా రేజేటి చంటి, కోశాధికారిగా దేవుపల్లి జీవరత్నం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్రబాబు మాదిగ, కార్యదర్శి యండవ రవి, అధికార ప్రతినిధి పొందూరు రామారావు తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ సీట్లు పెంచాలి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట కెజిబివి బాలికల వసతి గృహంలో కొత్తగా మంజూరైన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (mphw) సీట్లు 40 వరకే ఉన్నాయని వాటిని పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సీట్లు తక్కువ దరఖాస్తులు చేసుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సీట్ల సంఖ్యను పెంచాలన్నారు. ఎంపిహెచ్‌డబ్ల్యూగా శిక్షణ పొందితే ఉపాధి పొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా అధికారులు సీట్లు పెంచి ఎక్కువ మందికి అవకాశం కల్పిస్తే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని పలువురు కోరుతున్నారు. మానవతా దృక్పథంతో సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని నివేదిక పంపించి సీట్లు పెంచే విధంగా కృషి చేయాలని కోరుతున్నారు.

బిగ్ స్క్రీన్‌పై ప్రమాణస్వీకార ప్రసారం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేయనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బిగ్ స్క్రీన్‌పై ప్రసారం చేయనున్నట్లు ఇఒపిఆర్‌డి లక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపిడిఒ ఆదేశాల మేరకు పట్టణంలోని మెయిన్ రోడ్‌లో గల దార గంగమ్మ ఫంక్షన్ హాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం ప్రత్యక్ష ప్రచారాన్ని బిగ్ స్క్రీన్ పై తిలకించేందుకు ఏర్పాట్లు చేసామన్నారు. ఉదయం 9గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతోందని ఆసక్తి గలవారు వచ్చి తిలకించాలని ఆమె కోరారు.



మొక్కలు నాటుతున్న గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులు

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

బొబ్బిలి: పచ్చదనంతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి అన్నారు. పర్యావరణ వారోత్సవాలలో భాగంగా మంగళవారం గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో పాతకోటలో ఉన్న మాజీ సైనికుల సంక్షేమ కార్యాలయం, కోటిచెరువు వద్ద మొక్కలు నాటారు. ఈ ఏడాది 10వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.శశిభూషణ్, వెంకటనాయుడు, బాలభాస్కరరావు, మల్లేశ్వరరావు, జి.రామారావు, భార్గవి, నాగమణి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పశువులు రాకుండా గేటు వేయండి

బొబ్బిలి: మున్సిపల్ కూరగాయలు మార్కెట్లోకి పశువులు రాకుండా గేటు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మిను వ్యాపారులు కోరారు. కూరగాయలు మార్కెట్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. వ్యాపారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌కు గేటు ఏర్పాటు చేయకపోవడంతో పశువులు ప్రవేశించి కూరగాయలను చిందరవందరగా చేస్తున్నాయని చెప్పారు. ప్రతిరోజు పశువులతో ఇబ్బందులు పడుతున్నామని, గేటు ఏర్పాటు చేయాలని, కాలువలు నిర్మించాలని కోరారు. గేటు ఏర్పాటుకు కమిషనర్ హామీ ఇచ్చారు.

భోగాపురం ఇఒకు ఉద్యోగోన్నతి

భోగాపురం : భోగాపురం మేజర్ పంచాయతీ ఇఒగా పనిచేస్తున్న రామకృష్ణ నాయుడు పదోన్నతి పై బదిలీ అయ్యారు. గ్రేడ్2 పంచాయతీగా భోగాపురం పంచాయతీ ఉంది. ఈయనకు గ్రేడ్ వన్‌గా పదోన్నతి లభించింది. అందుకు విశాఖ జిల్లా ఆనందపురం మేజర్ పంచాయతీకి బదిలీ అయింది. ఎన్నికల ముందే బదిలీల జాబితా వచ్చినప్పటికీ ఎన్నికల కోడ్ ఉండడంతో నిలిచిపోయాయి. ఇటీవల ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో ఈయన రెండు మూడు రోజుల్లో ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లనున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

జామి : ఆస్తి గొడవల కారణంగా మండల కేంద్రానికి చెందిన వాక రమణ (55) పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కథనం ప్రకారం... కొంతకాలంగా వాక రమణ తన తమ్ముడు మధ్య ఆస్తి పంపకాలు విషయంపై చిన్నపాటి తగాదాలు జరుగుతున్నాయి. ఆస్తి పంపకాల విషయమై తమ్ముడు చొరవ చూపనందున మనస్థాపానికి గురైన అన్న వాక రమణ సోమవారం ఉదయం 5 గంటల సమయంలో తమ కళ్ళం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేసినట్లు మృతుని భార్య సరస్వతి తెలిపారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ ఎస్ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు చేయాలి

ప్రజాశక్తి - డెంకాడ

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా పనిచేయాలని డిఎంఅండ్‌హెచ్‌ఒ ఎస్.భాస్కరరావు సూచించారు. స్థానిక పిహెచ్‌సిని ఆయన మంగళవారం ఆశ డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆశాలు ఆస్పత్రిల్లో ప్రసవాలు సంఖ్య పెంచి మరింత ఉన్నతికి కృషి చేయాలన్నారు. శతశాతం వ్యాధి నిరోధక టీకాలు అందించాలని సూచించారు. డయేరియా ప్రబలకుండా వచ్చే వర్షాకాలనికి అనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్‌బిఎన్‌సి, హెచ్‌బివైసి కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ఆశా కార్యకర్తలు ప్రతి రోజూ క్రమం తప్పకుండా ఆశా యాప్‌లో లాగిన్ అవ్వాలన్నారు. విధులను సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్తే చక్కటి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. శివరామకృష్ణ, సిహెచ్‌ఒ ఏసయ్య, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

కొత్తవలస: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పిహెచ్‌సి డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. వియ్యం పేట పిహెచ్ లో సిబ్బంది, ఆశ వర్కర్స్ పని తీరు పై నెల వారీ సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. రానున్న వర్షా కాలంలో అంటువ్యాధులు ప్రభల కుండా సిబ్బంది క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతి నెలలోనూ డెలివెరీలు సంఖ్య పెంచాలని తెలిపారు. టీబీ మందులు రోగులకు క్రమం తప్పకుండా వేసుకునేటట్లు చూడాలన్నారు. వయోజనుల బీసీజీ టీకాలు 100శాతం వేసేటట్లు చూడాలని, కుష్టు రోగులు అనుమానిత కేసులు సర్వే నిర్వహించాలని తెలిపారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ జరిగేటట్లు చూడాలని, హైరిస్క్ గర్భిణుల పట్ల జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. మాతా, శిశు మరణాలు జరగ కుండా చూడాలన్నారు. ఆశ యాప్, 102 తల్లీ బిడ్డా ఎక్స్‌ప్రెస్ సేవలు, కిల్కారి సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒ నరసింహారావు, పిహెచ్ ఎన్. జగదాంబ, హెచ్‌వి పద్మావతి, హెచ్‌ఎస్ ఈశ్వరావు, టెక్నీషియన్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్స్ సత్యారావు, ఈశ్వరావు, ఏఎన్‌ఎమ్స్, ఆశ వర్కర్స్, పాల్గొన్నారు.



కొత్తవలస: మాట్లాడుతున్న వైద్యులు గోపాలకృష్ణ

సేవలకు ఘన సత్కారం

ప్రజాశక్తి - బొబ్బిలి

ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐగా పనిచేసి అనేక సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజల మన్నలను పొందిన సిఐ జై భీమ్‌ను రోటరీ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు జెసి రాజు, శ్రీ హరి, కార్యనిర్వాహక కార్యదర్శి రామకృష్ణలు మంగళవారం బొబ్బిలి ఎస్ఇబి ప్రాంగణంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం ఆయన బొబ్బిలి నుంచి బదిలీపై వెళ్లి సోంపేట ఎస్ఇబి సిఐగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆయన తన విధులలో భాగంగా బొబ్బిలి కోర్టుకి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన్ను సత్కరించారు. రోటరీ అధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతూ బొబ్బిలిలో పనిచేసిన సమయంలో ఆయన రోటరీ తో కలిసి రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, మత్తుపదార్థాల వినియోగం వల్ల సంభవించే నష్టాలపై యువతకు అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహణ తదితర సామాజిక, సేవ కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. విధులతో పాటు సమాజానికి ఉన్నతమైన సేవలు అందించారని సమాజానికి సేవలు అందించేవారు సత్కారానికి అర్హులని అన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఎస్ఇబి ఎస్ఐలు రామారావు, తిరుపతి రావు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణతోనే పర్యావరణ పరిరక్షణ

సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

ప్రజాశక్తి - రేగిడి

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించి వాటి నిర్వహణతోనే పర్యావరణ పరిరక్షణ కలుగుతుందని రాజాం న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం రాజాం మండలం, గార్రాజు చీపురుపల్లి గ్రామంలో న్యాయ సేవ సంఘం రాజాం ఆధ్వర్యంలో వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, న్యాయపరమైన అంశాలు, ప్రభుత్వ విధివిధానాలు, ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు కారణంగా అనేక రోగాలు బారిన పడుతున్నారన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ మొక్కల నాటాలన్నారు. పర్యావరణ సమతుల్యానికి గురుకావద్దని, మొక్కలు నాటడంతో భావితరాల ఆరోగ్యకరమైన, అహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని సూచించారు. పట్టణంలో వ్యర్థాలతో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు ఏర్పాటు చేయడం పట్ల ఎరువులు తయారుచేసి పంట పొలాలకు సారవంతమైన నేలలు తయారు చేసుకోవచ్చన్నారు. ఎరువులు రైతులకు అమ్మకం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరి గ్రామాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌విబి కృష్ణ సాయి తేజ్ మాట్లాడుతూ వ్యర్థ పదార్థాలు పట్టణ శివారులో డంపింగ్ యార్డ్‌లో వేయాలని సూచించారు. దీంతో గ్రామాలు, పట్టణాల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. వ్యర్థాల నుంచి ఎరువులు తయారీగా మరల్చడం గొప్ప విషయమన్నారు. ముందుగా న్యాయ మూర్తులు డంపింగ్ యార్డ్ నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జె.రామప్పలనాయుడు, రాజాం బార్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జయదేవ్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాసరావు, పర్యావరణ పరిరక్షణ సమితి కమిటీ కన్వీనర్ ఆర్‌విఎస్ నాయుడు, రెడ్ క్రాస్ ప్రతినిధులు కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ లక్ష్మణరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

తాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - భోగాపురం

నియోజకవర్గంలోని ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కార దిశగా ప్రత్యేక దృష్టి చేస్తామని జనసేన నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు అన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు భోగాపురంలోని ఆయన కార్యాలయంలో ఆయనకు మంగళవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎమ్‌పి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి పై దృష్టి సారిస్తామన్నారు. దీనిపై జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో మాట్లాడతామని అన్నారు. తీర ప్రాంతంలోని మత్స్యకారులకు కూడా తాగునీటి ఇబ్బందులు తీరుస్తామన్నారు. గతంలో ఎన్‌డిఎ ప్రభుత్వం లోనే తాగునీటి ప్రాజెక్టులు వచ్చాయన్నారు. ఇప్పుడు కూడా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అవసరమైన ప్రాజెక్టులను ఎమ్మెల్యే సహకారంతో తీసుకువస్తామన్నారు.

ఎల్‌ఈడి స్క్రీన్‌ల ద్వారా ప్రమాణ స్వీకారం

భోగాపురం గ్రామంలోని కళ్యాణ మండపంలో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా ఎల్‌ఇడి స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారం వేయనున్నట్లు శ్రీనివాసరాజు తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తెలుగు దేశం, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని ఆయన తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో ఆ పార్టీ నాయకులు మైలపల్లి నరసింహులు, కర్రోతు శ్రీనివాసరావు, మొక్క కృష్ణారెడ్డి, బలరాం తదితరులు ఉన్నారు.



శ్రీనివాసరాజును సత్కరిస్తున్న జనసేన నాయకులు

ఎనిమియా రోగికి 'సాధన' రక్తదానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎనిమియా వ్యాధితో బాధపడుతున్న రోగికి సాధన యువజన సంఘం సభ్యులు రక్తదానం చేశారు. మంగళవారం స్థానిక మిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బి.రోషిణి(6) ఎనిమియా వ్యాధితో చికిత్స పొందుతుంది. బాలికకు ఏబి పాజిటివ్ 3యూనిట్ల రక్తం అవసరం కావడంతో జరజాపు పేటకు చెందిన సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్‌కి పేషెంట్ బంధువులు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో సాధన యువజన సంఘం వెంటనే స్పందించి సభ్యులు గర్భపు శ్రీను గ్రూపు ఏబి పాజిటివ్ కావడంతో వెంటనే మిమ్స్ హాస్పిటల్‌కి వెళ్లి యూనిట్ రక్తదానం చేసి పేషెంట్ బంధువులు రాధ, శ్రీనుకి అందజేశారు. అంతే కాకుండా 2వ యూనిట్ ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ ద్వారా మద్దిల రాంబాబు రక్త దానం చేశారు. కాగా గర్బాపు శ్రీను 19వ సారి, మద్దిల రాంబాబు 30సారి రక్త దానం చేశారు. రక్త దాతలను ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి నాగేశ్వర రావు, మిమ్స్ హాస్పిటల్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ ఏ.శ్రీనివాసరావు, బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జి యం.రమణ, డాక్టర్ దివ్య, సాధన యువజన సంఘం అభినందించారు.



రక్తదానం చేస్తున్న గర్భపు శ్రీనును అభినందిస్తున్న దుర్గాప్రసాద్

నవధాన్యాలతో నేలకు మేలు

ప్రజాశక్తి - గరివిడి

నవధాన్యాలతో నేలకు ఎంతో మేలు జరుగుతోందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఆనంద్‌రావు అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో తొలకరి వర్షాలకు ముందుగా రైతులందరూ నవధాన్యాలు సాగు చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం గరివిడి, మెరకముడిదాం మండలాల్లో ప్రకృతి సాగును పరిశీలించారు. గెడ్డపువలస, శాతంవలస, బాణాం గ్రామాల్లో పర్యటించి రైతులకు సలహాలు సూచనలు చేశారు. ఎకరానికి 12 కేజీలు విత్తనాలు చల్లుకోవడం వల్ల నేల సారవంతంగా ఉంటుందని, నేల ఎల్లపుడూ తేమగా ఉంటుందని చెప్పారు. నేలలో ఉండే సూక్ష్మజీవులు సమృద్ధిగా అభివృద్ధి చెంది మొక్కలకు అందిస్తాయని నేల కోతకి గురికాకుండా ఉంటుందని చెప్పారు. ఈ సంవత్సరం ప్రతి రైతు తనకున్న విస్తీర్ణంలో నవధాన్యాలు సాగు చేయించాలని కోరారు. నవధాన్య కిట్లు రైతు భరోసా కేంద్ర పరిధిలో రైతులకు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. జీలుగులతో పాటుగా వీటిని కలిపి చల్లుకుంటే భూసారం పెరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, నేచరల్ ఫార్మింగ్ అసోసియేట్ శంకర్, మాస్టర్ ట్రైనర్ సూర్యకుమారి, విఎఎ సూరిబాబు, యూనిట్ ఇంచార్జి సింహాచలం, త్రినాద్, రాము, తుమ్మగంటి సుశీల, చీడి రామకృష్ణ, సిగ అనసూయ, మీసాల గోవిందరావు, ఆరింగి దేవి, అలమండ ఉమా రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస ఆర్‌బికె వద్ద నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. 21 రకాలు విత్తనాలు, పప్పుజాతి, నూనిజాతి, సుగంధ ద్రవ్యాలు, ఆకుకూరలు, తీగజాతి విత్తనాలతో పాటు జీలుగా, కట్టెలు, పిల్లి పెసర, కలిపి రైతులకు అందించారు. వీటి వల్ల భూమికి ఎలా భూసారం పెరుగుతుందో రైతులకు ఆర్‌టిఎల్ ప్రకాష్ వివరించారు. ఈ కార్యక్రమంలో విఎఎ రాజశేఖర్, ఎస్‌డిఎ వి.లక్ష్మి, వరప్రసాద్, పువ్వాల వెంకటరమణ, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఖాతాదారుల సేవలే లక్ష్యం

ప్రజాశక్తి - రామభద్రపురం

ఖాతాదారులకు మెరుగైన సేవలే ఎపి గ్రామీణ వికాస్ బ్యాంకు ప్రధాన లక్ష్యమని రీజినల్ మేనేజర్ రామకృష్ణరాజు అన్నారు. గత కొన్నేళ్లుగా ఉత్తమ లక్ష్యాలతో నడుస్తున్న బ్రాంచ్‌ను అన్ని సౌకర్యాలతో ఖాతాదారులకు అందుబాటులో జాతీయ రహదారి పక్కన ఎస్‌బిఐకి దగ్గరలోకి మార్పు చేసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ఖాతాదారులకు తమ బ్యాంకు ద్వారా అన్ని రకాల సేవలు సత్వరమే చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఇక్కడ తమ శాఖ ఎన్నో ఏళ్లగా వేల సంఖ్యలో ఖాతాదారుల సేవలో ముందంజలో ఉందన్నారు. ఇప్పుడు ఉన్న అనేక బ్యాంకులు అప్పట్లో లేవని, ఆరోజుల్లో తమ శాఖ ద్వారా విస్తృత సేవలు అందజేసామన్నారు. ఇప్పుడు కూడా అన్ని రకాల రుణాలు, ముఖ్యంగా పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాలు, ఉద్యోగస్తులకు వ్యక్తిగత రుణాలు, బంగారు ఆభరణాల పై అతి తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ శాఖలో హబ్ కూడా ఏర్పాటు చేశామని రుణాలు స్వల్ప వ్యవధిలోనే ప్రాసెస్ చేస్తారన్నారు. డిపాజిట్లపై అధిక వడ్డీ రేట్లు ఉంటాయన్నారు. అన్ని రకాల భీమా పథకాలు అమలు చేస్తామన్నారు. తమ బ్యాంకు శాఖలు ఖాతాదారులు వినియోగించుకొని బ్యాంకు పురోభివృద్ధికి తోడ్పడా లన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్(ఆపరేషన్స్) సునీల్ వర్మ, సీనియర్ మేనేజర్ (బిజినెస్) గణేష్, ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ గంట అప్పలనాయుడు, స్థానిక బ్రాంచ్ మేనేజర్ విజయకుమార్, ఫీల్డ్ ఆఫీసర్ గౌరీపతిరావ్, అకౌంటెంట్ రామేశ్నాయుడు, హబ్ ఇన్చార్జి మస్తాన్ వలి, డీవో రాంప్రసాద్, సిబ్బంది అప్పారావు, భారతి, ఖాతాదారులు పాల్గొన్నారు.

బాలుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధి కొండపేటలో బాలుడు అనుమాన స్పదంగా మృతి చెందాడు. మంగళవారం స్థానికులు అందించిన వివరాల ప్రకారం నగర పంచాయతీ పరిధి కొండపేటకు చెందిన కారెపు చైతన్య (15) అనే బాలుడు గ్రామ శివారు కొండపేట - కొత్తపేట రహదారి కొండ వద్ద గాయాలతో అనుమాన స్పదంగా మృతి చెందారు. కాగా గత రెండు రోజులుగా కనిపించక పోవడంతో బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఇంతలో బాలుడు అనుమానస్పద స్థితిలో విగత జీవిగా కనిపించారు. మృతిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.



బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇనాం భూములకు పాసుపుస్తకాలు

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలోని చింతలవలస ఇనాం భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేయాలని సిసిఎల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పాసుపుస్తకాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఎన్నికలు సమీపించడంతో జారీ కాలేదు. తరువాత వచ్చిన టిడిపి ప్రభుత్వ సమయంలో ఆ భూములు మాన్సాస్‌కు చెందినవని కోర్టులో మాన్సాస్ సంస్థ కేసు వేసింది. ఇన్నాళ్లకు సిసిఎల్ కమిషనర్ తిరిగి ఆ భూముల్లో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సుమారు 384 మంది రైతులకు 174 ఎకరాల పల్లపు భూమి, 340 ఎకరాల మెట్ట భూముల్లో పట్టాలు ఇవ్వనున్నారు. కాగా మొత్తం 905 ఎకరాల్లో ఇనాం భూములున్నట్లు గుర్తించారు. ఇందులో కొంత మాన్సాస్‌కు, మరికొంత ప్రభుత్వానికి ఉన్నట్లు సమాచారం.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - బొబ్బిలి

శ్రీసత్య సాయిసేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక సత్యసాయి మందిరంలో జరిగిన ఈ శిబిరంలో కంటి రోగుల నుంచి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సహకారంతో కంటి రోగులకు పరీక్షలు నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ బి.వివేక్‌వర్మ 96 మంది కంటి రోగులకు పరీక్షలు చేయగా 34 మందికి కేటరాక్ట్ సర్జరీకి సిఫారసు చేశారు. మండల పరిధిలోని గ్రామాలు నుంచి కంటి రోగుల రావడం శుభపరిణామం అన్నారు. వీరందరికీ శంకర్ ఫౌండేషన్ బస్ ద్వారా తీసుకొని వెళ్ళి, ఆపరేషన్ చేసిన తరువాత తిరిగి తీసుకొని వస్తారని వారు తెలిపారు. సర్జరీకి ఎంపికైన వారందరికీ భోజనాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి కన్వీనర్ బి.లక్ష్మణరావు, సేవా సమితి సభ్యులు కె.సింహాచలం, టి.వేణుగోపాల్‌నాయుడు, ఎం.సూర్యం, ఎ.మధు, సిహెచ్. అప్పలనాయుడు, క్యాంప్ ఇంచార్జి సిహెచ్. వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - బాడంగి

మండలంలోని ఎరుకుల పాకలు గ్రామంలో మంగళవారం లక్ష్మీపురం సర్పంచ్ పాలవలస పార్వతీ, ఎంపిటిసి పాలవలస గౌరు చేతులు మీదుగా మంగళవారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. బొబ్బిలి ఎమ్మెల్యేగా బేబినాయన విజయం సాధించిన నేపథ్యంలో పిన్నవలస గ్రామానికి చెందిన కొల్లి రామనాయుడు సౌజన్యంతో ఈ చీరలను పంపిణీ చేసినట్లు పాలవలస గౌరు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న గౌరు, పార్వతీ

వైభవంగా పరదేశమ్మ పండగ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేటలో మంగళవారం పరదేశమ్మ తల్లి పండగ సందర్భంగా అనుపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ భక్తి శ్రద్ధలతో అమ్మవారిని గ్రామ పురవీధులలో మేళతాళాలు, భాజా భజంత్రీలు, బ్యాండ్ మేళాలు, తప్పెడ గుళ్ళు, పులి వేషాలు, జానపద గేయాలతో కూడిన మహిళా బృందాల కోలాటం మధ్య ఊరేగించారు. ఈ ఉత్సవంలో చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



వేపాడ: ఘటాలను ఊరేగిస్తున్న మహిళలు

ఘనంగా దార గంగమ్మ చిన్న పండగ

శృంగవరపుకోట: దార గంగమ్మ చిన్న పండగను పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి దార గంగమ్మ వారికి ఆలయ ప్రధాన అర్చకులు అగ్నిహోత్ర రాజగోపాలచారి ఆధ్వర్యంలో అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇందిరమ్మ కాలనీలో మూలకు చేరిన బోర్లు

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో చేతిపంపు బోర్లు మూలకు చేరాయి. కాలనీలో నాలుగు బోర్లు ఉన్నప్పటికీ నాలుగు పాడైపోవడంతో మంచినీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకు మున్సిపల్ పైపులైన్ లేదు. ప్రజలకు ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న నీరుని తాగేందుకు ఉపయోగించగా బట్టలు ఉతికేందుకు, ఇతర అవసరాలకు చేతిపంపు బోర్లు నీరునే వినియోగిస్తున్నారు. బోర్లు పాడైపోయి నెలలు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు స్పందించి పాడైపోయిన బోర్లను బాగు చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.



మూలకు చేరిన బోరు ఇదే..